RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 140 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శనివారం, 23 నవంబర్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# వరుస ఎన్‌కౌంటర్లతో దద్దరిల్లుతోన్న దండకారణ్యం

## 10 మంది మావోయిస్టుల హతం



సుకుమ, నవంబర్,22 : ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో 10 మంది మావోయిస్టుల హతమయ్యారు. అయితే.. కంచుకోట లాంటి ఛత్తీస్‌గఢ్ అడువుల్లో భారీ ఎన్‌కౌంటర్లు.. మావోయిస్టుల ఉనికికే సవాల్ విసురుతున్నాయి. వరుస ఎన్‌కౌంటర్లతో ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో కాల్పుల మోత మోగుతోంది. దండకారణ్యం దద్దరిల్లుతోంది.. పచ్చని అటవీప్రాంతం ఎరుపెక్కుతోంది.. తాజాగా.. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది.

యాంటీ నక్సలైట్ ఆపరేషన్‌లో భాగంగా భేజీ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడవులను భద్రతా బలగాలు జల్లెడ పట్టాయి. సుక్మా జిల్లా బండార్ పదర్ కొండల్లో ఒక దగ్గర మావోయిస్టులు నక్కి ఉన్నట్లు గుర్తించి వారిని చుట్టుముట్టారు.

అయితే.. మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులకు దిగడంతో భద్రతా బలగాలు ఎదురు కాల్పులు జరిపాయి. దాంతో.. 10 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఘటనాస్థలం నుంచి ఏకే 47, ఇన్సాస్, ఎస్ఎల్ఆర్‌లు స్వాధీనం చేసుకున్నారు. కొన్ని ఆటోమెటిక్ ఆయుధాలతో పాటు విప్లవ సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలు లభ్యమయ్యాయి.

భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఏడాది కాలంగా భీకర పోరు జరుగుతోంది. ఫలితంగా వందలాది మంది మావోయిస్టులు హతమవుతున్నారు. వారం రోజుల క్రితం కూడా అబుజ్‌మడ్ అడవుల్లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు ఎదురుకాల్పులు జరిగాయి. ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఏప్రిల్ 16న కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఏప్రిల్ 2వ తేదీన బీజాపూర్ జిల్లా పొర్చెలి అటవీప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో 9మంది మావోయిస్టులు మృతిచెందారు. మొత్తంగా.. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యాన్ని నలువైపుల నుంచి పోలీసులు జల్లెడ పడుతుండడంతో సరిహద్దు రాష్ట్రాలు కూడా అలెర్ట్‌గా ఉంటుండడంతో మావోయిస్టులకు ఎదురుదెబ్బ తగులుతోంది.




హైదరాబాద్: అదానీ కుంభకోణాన్ని అమెరికా అధికారులు బట్టబయలు చేశారని, వెంటనే అతన్ని అరెస్టు చేయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు తక్షణమే జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటు చేయాలని కోరారు. "అదానీ దాదాపు రూ.2వేల కోట్ల మేర లంచాలు పంచారు.

ఆయన అవినీతిపై రాహుల్‌గాంధీ ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ స్పందించలేదు. అర్హత లేకపోయినా అదానీకి రూ.వేల కోట్ల రుణాలు ఇచ్చారు. ప్రధాని మోదీ అండతో అనేక విమానాశ్రయ కాంట్రాక్టులు చేజిక్కించుకుని అవినీతి సామ్రాజ్యం స్థాపించారు. 2014 తర్వాత అదానీ సంపద ఎలా పెరిగిందో చూశాం. రూ.100 కోట్ల అవినీతి జరిగిందని చెప్పి సీఎంలను జైళ్లో వేశారు. రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడిన అదానీపై చర్యలేవి?" అని మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు.




## న్యాయ వ్యవస్థకు సవాలుగా మారిన పెండింగ్ కేసులు: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: భారీగా కేసులు పెండింగ్‌లో ఉండటం న్యాయ వ్యవస్థకు సవాలుగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కోర్టులపై ఈ భారాన్ని తగ్గించేందుకు మధ్యవర్తిత్వం, వివాదాల పరిష్కార కేంద్రాల అవసరం ఎంతో ఉందని సీఎం అన్నారు. వాటి ద్వారా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కారమవుతాయని.. వివాదంలో చిక్కుకున్న ఇరు వర్గాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. గచ్చిబౌలిలో నిర్వహించిన కామన్‌వెల్త్ మీడియేషన్, ఆర్బిట్రేషన్ కాన్ఫరెన్స్‌లో సీఎం ప్రసంగించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేతో పాటు ఇతర న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో హైదరాబాద్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు.

ప్రపంచస్థాయి పెట్టుబడిదారులకు, బడా పారిశ్రామికవేత్తలకు మాత్రమే కాకుండా సామాన్య ప్రజలు, చిన్న సంస్థలకు కూడా ఆర్బిట్రేషన్ కేంద్రాలు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. పూర్వకాలం నుంచే భారత్‌లో మధ్యవర్తిత్వం ఉందన్నారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. పలు అంతర్జాతీయంగా కొన్ని దేశాల్లో మధ్యవర్తిత్వంపై చట్టాలున్నాయన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మాట్లాడుతూ.. వివాదాల పరిష్కారం ద్వారా శత్రుత్వం తగ్గి స్నేహభావం పెరుగుతుందన్నారు. న్యాయ వ్యవస్థ కూడా మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహిస్తోందని ఆయన పేర్కొన్నారు.




## మా బాధ్యతలను నిర్వహిస్తున్నాం

### కొన్నిసార్లు మనసును చంపుకొని పని చేయాల్సి వస్తోంది

హైదరాబాద్: ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలు తొలగించడంతో పాటు, చెరువుల్లోకి కొత్త నిర్మాణాలు రాకుండా అడ్డుకోవడమే తమ బాధ్యత అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. చెరువులను పునరుద్ధరించాలంటే ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదన్నారు. చెరువులో నీటి విస్తీర్ణం, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లు, విలేజ్ మ్యాప్‌లను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రంగనాథ్ మాట్లాడారు. "అమీన్‌పూర్ చెరువు తూములు మూసివేయడం వల్లే లేఅవుట్లు మునిగాయి. ఎఫ్‌టీఎల్ లెవెల్ పరిగణనలోకి తీసుకొని చెరువులు సర్వే చేయిస్తాం. తప్పుడు అనుమతులు ఇచ్చినవి, అనుమతులు రద్దు చేసిన ఇళ్లను మాత్రమే హైడ్రా కూల్చివేసింది. అనుమతులు లేకుండా ఉన్న ఇళ్లు.. పెద్దవాళ్లవైనా, పేదలవైనా కూల్చక తప్పదు. కొంతమందిపై చర్యలు తీసుకోవడం వల్లే హైడ్రా చేసే పని అందరికీ తెలిసింది. ప్రజల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై అవగాహన వచ్చింది.. దీనిపై చర్చ కూడా జరుగుతోంది. అక్రమ నిర్మాణాల విషయంలో.. మానవత్వంతో ఆలోచిస్తే సమాజమంతా బాధపడాల్సి వస్తుంది. కొన్నిసార్లు మనసును చంపుకొని పని చేయాల్సి వస్తోంది. ఎఫ్‌టీఎల్ పరిధి నిర్ధరించాక ఏదైనా నిర్మాణం చేపడితే అలర్ట్ వస్తుంది. అక్రమ నిర్మాణాల నియంత్రణకు అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నాం. ఇప్పటివరకు ఎన్నో ఆక్రమణలు జరిగాయి.. ఇకపై అలా జరగకుండా అడ్డుకోవడమే ప్రభుత్వ ఉద్దేశం. హైడ్రా పనితీరు కారణంగా ప్రజల్లో అవగాహన పెరిగింది. చెరువులు ఆక్రమణకు గురికాకుండా స్థానికులు కూడా నిఘా పెడుతున్నారు" అని రంగనాథ్ తెలిపారు.

# స్పీకర్‌దే తుది నిర్ణయం




హైదరాబాద్: జంపింగ్ జంపాగ్‌లకు తెలంగాణ హైకోర్టులో బిగ్ రిలీఫ్ లభించింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో ఇవాళ(శుక్రవారం) విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని పిల్ దాఖలైంది. బీఆర్ఎస్ పార్టీపై గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరిపై స్పీకర్ చర్యలు తీసుకునేలా అదేశాలు ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు పిటిషన్ వేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 4 వారాల్లోగా టైం ఫ్రేమ్ ఫిక్స్ చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం వినోద్ కుమార్‌కు సింగిల్ బెంచ్ ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఆదేశాలను సవాలు చేస్తూ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అసెంబ్లీ కార్యదర్శి అప్పీల్ చేశారు. అసెంబ్లీ కార్యదర్శి రిట్ అప్పీల్‌పై హై కోర్టు ఇవాళ తీర్పు ప్రకటించింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. స్పీకర్ తుది నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు డివిజన్ బెంజ్ స్పష్టం చేసింది. స్పీకర్‌కు ఏలాంటి టైం బాండ్ లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. రీజనబుల్ టైంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు కొట్టేవేసింది.

**సీజే ధర్మాసనం తీర్పులో కీలక అంశాలు..** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై 10వ షెడ్యూల్ ప్రకారం నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు సీజే ధర్మాసనం సూచించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సీజే ధర్మాసనం కొట్టివేసింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, 10వ షెడ్యూల్, అసెంబ్లీ ఐదేళ్ల గడువును దృష్టిలో ఉంచుకుని స్పీకర్ తగిన నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. ఈ సందర్భంగా సింగిల్ బెంచ్ ఉత్తర్వులను కొట్టివేసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు విచారణ చేసింది. బీఆర్ఎస్ పార్టీలో గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు ప్రకటించాలని కోరుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిటిషన్లు వేశారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం ఈరోజు విచారణ చేసింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద్ గౌడ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అనర్హతపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పులున్నా పరిగణలోకి తీసుకోవడంలేదని. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తెలిపారు. కాగా బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది.

వాదనలు విన్న న్యాయస్థానం విచారణను వాయిదా వేసింది. ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారని.. వారిని అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్, హుజూరాబాద్ శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డిలు కొద్ది రోజుల క్రితం వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

# పులి దాడిలో మరణించిన పశువులకు నష్టపరిహారం అందజేత




**పెంచికల్ పేట నవంబర్ 22, (ప్రభాత సమాచారం)**
పెంచికల్పేట్ రేంజ్ పరిధిలో నవంబర్ మొదటి వారంలో పెద్దపులి దాడిలో మరణించిన పశువుల యజమానులు సిడం కిషన్ రావు, (గుండెపల్లి )20వేలు, ఆత్రం విష్ణు (కమ్మర్గాం)14వేలు రూపాయల చెక్కును ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనిల్ కుమార్ చేతుల మీదుగా నష్టపరిహారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎస్ ఓ లు అస్మ, జగన్మోహన్ గౌడ్, ఎఫ్ బి ఓ లు విజయలక్ష్మి, శ్రావణ్, సతీష్, లచ్చన్న, మరియు మహేష్ పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న యువకులు



**చింతలమానపల్లి నవంబర్ 22 (ప్రభాత సమాచారం)**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి డబ్బా గ్రామంలో ఒక మహిళ మతిస్థిమితం లేకుండా గత 15 రోజులుగా తిరుగుతుంది. విషయం తెలుసుకున్న ఆర్ ఎస్ ఆర్ యూత్ సభ్యులు యూత్ అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా ఆకలితో అలమటించి పోతున్న ఆ తల్లి వద్దకు చేరుకొని భోజనం పెట్టి మానవత్వం చాటుకున్నారుఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్, యూత్ కోశాధికారి అశోక్,సభ్యులు నగేష్ ,నాయకులు ఆనంద్ రావు, శ్రీనివాస్ మరియు గ్రామస్థులు యువకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కంటి చూపు పరీక్షలు



**కాగజ్ నగర్ నవంబర్ 22 (ప్రభాత సమాచారం)**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాస్పల్లి నందు 6 నుంచి 10 తరగతి విద్యార్థులకు డాక్టర్ సురేందర్ ఆర్ బి ఎస్ కే మెడికల్ ఆఫీసర్ ఆప్తామ్మిక్ ఆఫీసర్ జగన్మోహన్, శ్రీమతి ఉమా ఫార్మసిస్ట్ ల ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థుల యొక్క కంటి చూపు పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సురేందర్ గ మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఆకుకూరలు ఎక్కువగా తినాలని కంటిని ఎల్లప్పుడూ చల్లటి నీళ్లతో శుభ్రపరచుకోవాలని పలు జాగ్రత్తలను సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 185 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా ఐదుగురు విద్యార్థుల్లో దృష్టిలోపం కనుగొని వారికి కంటి అద్దాలను సిఫార్సు చేయటం జరిగింది. ఈ ఐదుగురు విద్యార్థులకు త్వరలోనే కంటి అద్దాలు ప్రభుత్వం ద్వారా పంపిస్తామని తెలిపారు .ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు ఏటుకూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ, రవికుమార్, ఆస్మి అలీ, నాగరాణి, వనిత, తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జూర్ లో యోగ శిక్షణ కేంద్రం ప్రారంభం



**బెజ్జూర్ నవంబర్ 22 (ప్రభాత సమాచారం)**
బెజ్జూర్ మండల కేంద్రంలో శుక్రవారం యోగా శిక్షణ కేంద్రం ప్రారంభించిన్నట్లు ఆయుర్వేదిక్ సెంటర్ ఫార్మసిస్ట్ వొల్లాల అశోక్ గౌడ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాల ప్రాంగణంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లో ప్రతిరోజు ఉదయం 6 గంటలకు యోగా శిక్షణ (మహిళల కోసం యోగ శిక్షకులు బొజ్జ కళావతి యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పురుషులకు యోగా శిక్షణ యోగ శిక్షకులు జనగామ లక్ష్మణ్ యోగ నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున ఇట్టి విషయాన్ని యువతీ యువకులు ఆసక్తి గలవారు యోగ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగ చేయాలనుకునేవారు సమయపాలనతో హాజరుకావాలని తెలిపారు.

# కవ్వాల్ ఫారెస్ట్ జోన్లోని గ్రామాల సమస్యలను పరిష్కరించాలి

## టైగర్ రిజర్వ్ గవర్నింగ్ బాడీస్ మీటింగులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**హైదరాబాద్ నవంబర్ 22(ప్రభాత సమాచారం)**
కవ్వాల్ ఫారెస్ట్ జోన్లోని గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రాష్ట్ర అటవి, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను కోరారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. కవ్వాల్ టైగర్ జోన్లోని ఫారెస్ట్ లో వాహన రాకపోకలకు కొంతమేర అనుమతి ఇవ్వాలని కోరారు. కడెం మండలంలోని అల్లంపల్లి,సిరికొండ మండలంలోని వాయిపేట, పెంబి మండలంలోని అంకెన, ఇస్లాంపూర్,ధోంధరి,గ్రామాలలో రోడ్డు సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉట్నూర్ మండలం ధర్మాజీపేట,కడెం మండలం మిద్దెచింత,పెంబి మండలం చాకిరేవు, బుర్కారెగడి, గ్రామాలలో నెలకొన్న కరెంట్ సమస్యలున్నాయని అటవీ శాఖ అనుమతిస్తే కరెంట్ సమస్యలు తీరుతాయని అన్నారు. లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ సమస్యను సైతం పరిష్కరించాలన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాలు కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ఉన్నాయని, ఆ గ్రామాలలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు. ఈ సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం.డోబ్రియాల్, పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలుసింగ్, డిసిసిఎఫ్ ఆంజనేయులు(హెడ్ ఆఫీస్), సిఎఫ్ రాంబాబు (అమ్రాబాద్ టైగర్ రిజర్వ్), శాంతారాం(కవ్వాల్ టైగర్ రిజర్వ్), డిఎఫ్ఓలు రోహిత్ (నాగర్ కర్నూల్), బాజీరావ్ పాటిల్ (ఆదిలాబాద్), రాజశేఖర్ (నల్గొండ), ఎఫ్ డిఓ రామ్మూర్తి, ఓఎస్డీ శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

# 26 న జరిగే ధర్నాను విజయవంతం చెయ్యండి






**కాగజ్ నగర్ నవంబర్ 22 (ప్రభాత సమాచారం )**
కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ముంజం. శ్రీనివాస్ హితవు పలికారు .శుక్రవారం రోజు న సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ రాయల్ గార్డెన్ లో జరిగిన జిల్లా స్థాయి కార్మికుల జనరల్ బాడీ సమావేశం సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ .కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్పొరేట్ శక్తులే ప్రయోజనం పొందుతున్నాయని ,కార్మికులకు రైతులకు ,సామాన్య ప్రజలకు ఎలాంటి ప్రయోజనం పొందడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు కార్మిక కోడ్ ల వల్ల కనీస వేతనం, ఉద్యోగ భద్రత ,సామాజిక భద్రత ,ఎనిమిది గంటల పని దినం, ట్రేడ్ యూనియన్ హక్కులు అగమ్యగోచరంగా మారనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే బీజేపీ పాలిత ప్రాంతాలలో కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం రద్దుచేసి 12 గంటల పని దినాన్ని అమలులోకి తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు .అన్ని పంటలకు మద్దతు ధర వ్యవసాయ ఖర్చుకు 50 శాతం అదనంగా జోడించి అమలు చేయాలని, రుణమాఫీ చట్టం చేయాలని అనేక సంవత్సరాలుగా రైతులు పోరాడుతున్న రైతు ప్రేమ అని చెప్పుకుంటున్న మన ప్రధాని నరేంద్ర మోడీ పట్టించుకోవడంలేదని విమర్శించారు .అందుకే దేశవ్యాప్తంగా కార్మిక కర్షకులు ఐక్యతతో నవంబర్ 26న పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేయనున్నమని తెలిపారు .ఈ నిరసనలో కార్మిక వర్గం ఐక్యమత్యంతో పాల్గొని నరేంద్ర మోడీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసించాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు, పెన్షన్ 10వేల రూపాయలు అందించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటు కరణ ఆపాలని ,తమ నిజమైనా దేశభక్తిని చాటుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. చేతల్లో బహుళ జాతి కంపెనీలకు సేవలు చేస్తూ మాటల్లో మాత్రం దేశభక్తి గురించి గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. అంగన్వాడి ,ఆశ ,మధ్యాహ్నం భోజన కార్మికులు, క్షేత్ర సహాయకులు ,వివోఏలు,ఆర్ పి, తదితర పథకాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా శ్రమదోపిడికి ప్రభుత్వాలే పాల్పడుతున్నాయని విమర్శించారు .ఈ సమావేశం లో సిఐటియు జిల్లా అధ్యక్షులు రాజేందర్ జిల్లా కార్యదర్శి ఆర్. త్రివేణి ప్రసంగించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ .పద్మ లు సిఐటియు జిల్లా నాయకులు కృష్ణమాచారి. శంకర్ జోతి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు



**సిర్పూర్ టి నవంబర్ 22, (ప్రభాత సమాచారం)**
జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మరియు అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు పర్యవేక్షణలో సిర్పూర్ టి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల సిర్పూర్ టి నందు జిల్లా పోలీసు కళాబృందం వారు నూతన చట్టాలు,రోడ్డు ప్రమాదాలు మరియు ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, గంజాయి నివారణ పై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమం లో ఏఎస్ఐ చంద్ర శేఖర్ మాట్లాడుతూ ఈ మధ్యకాలం లో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మిహొ మోసపోవద్దని, ఎవరైనా మోసపోయినట్టైతేహొ వెంటనే 1930 నంబర్ కి పిర్యాదు చేయాలని, అదేవిధంగా పోలీస్ స్టేషన్ పరిధిలో అన్నిహొ గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దీని వల్ల గ్రామంలోహొఏ సంఘటన జరిగిన వెంటనేహొతెలుస్తోంది అని తెలిపారు, సిసి కెమెరాలు ఏర్పాటు సహకరించలని కోరారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని, ప్రభుత్వం , పోలీస్ తరపున అన్ని విధాల సహాయసహకారులు ఉంటాయని అన్నారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని,హొలైసెన్స్హొ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్హొఆవశ్యకత గురించి వివరించారు. గ్రామాల్లో అనుమానస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు వున్న పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని తెలిపారు. గ్రామంలోహొ చిన్న చిన్న తగాదాలకు పోయి జీవితం నాశనము చేసుకొవద్దని, నేరరహిత గ్రామాలుగ చేయడానికి ప్రజలు కృషి చేయాలనీ సూచించారు. మంత్రాలు తత్రాలు ముడనమ్మకాలు నమ్మవద్దని, గ్రామాల్లో ఏ సమ్యస వున్న వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలుపాలన్నారు,లేదా 100 నెంబర్ కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయ సిబ్బంది, సిర్పూర్ టి ఏఎస్ఐ చంద్రశేఖర్ మరియు పోలీసు సిబ్బంది, పోలీస్ కళా బృందం సభ్యులు రాంచందర్, వెంకటేశ్, చంద్రశేఖర్,రజిత, సంఘవి, గ్రామస్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# పిసిసి అధ్యక్షున్ని సన్మానించిన శంకర్ గౌడ్

**బెల్లంపల్లి, నవంబర్ 22( ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి శంకర్ గౌడ్ శుక్రవారం రోజున రాష్ట్ర పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను హైదరాబాదులోని తన ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గౌడ సంఘం మోకు దెబ్బ రాష్ట్రనాయకులుగా గౌడకుల సంఘానికి చెందిన పలు సమస్యలు విన్నవిస్తూ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. చెన్నూరు బెల్లంపల్లి నియోజక వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న వినోద్, వివేక్, ఎమ్మెల్యే లకి సహాయ సహకారాలు అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు తన వంతు ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు.



# ఈస్గాం ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మహేందర్



**కాగజ్ నగర్ నవంబర్ 22, (ప్రభాత సమాచారం)**
కాగజ్నగర్ మండలం ఈస్గాం పోలీస్ స్టేషన్లో ఎస్ఐ గా మహేందర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. కాగజ్నగర్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ గా విధులు నిర్వహించిన ఆయన ఈస్గాం ఎస్ఐ గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈస్గాం పోలీస్ స్టేషను పరిధిలోని ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎటువంటి సమస్యలు ఉన్నా నిస్సందేహంగా తనను నేరుగా సంప్రదించగలరని తెలిపారు. శాంతిబద్రతలను కాపాడతానని, అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు

# బెజ్జూర్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ కుమార్.




**బెజ్జూర్ నవంబర్ 22 (ప్రభాత సమాచారం )**
బెజ్జూర్ ఎస్సైగా కె .ప్రవీణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉండి తమ దృష్టికి వచ్చిన ప్రజల సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు .సమస్యలు ఉన్నట్లయితే ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు .చట్ట వ్యతిరేక అసంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందరూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని కోరారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ విక్రమ్ ఆసిఫాబాద్ ఎస్పీ కార్యాలయానికి, సిర్పూర్ (యు)లో ఎస్సైగా విధులు నిర్వహించిన ప్రవీణ్ కుమారును బెజ్జూర్ ఎస్సైగా ఉన్నతాధికారులు ఇటీవల బదిలీ చేయడం జరిగింది. దీంతో బెజ్జూర్ ఎస్సైగా శుక్రవారం కె ప్రవీణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

# దేవాలయాలకు నిధులు ఇవ్వండి



**బోథ్ నవంబర్ 22( ప్రభాత సమాచారం)**
బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా దేవాలయాలకు పెండింగ్లో ఉన్న నిధులను విడుదల చేయాలని, టెండర్ దశలో ఉన్న బోథ్ పట్టణ కేంద్రంలోగల శ్రీ భక్త శివ మార్కండేయ ఆలయానికి టెండర్లు పిలవాలని బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను సచివాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. ఆడే గజేందర్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న నిధులను విడుదల చేయించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలగజేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ భోజ్జు పటేల్, మాజీ కేంద్ర మంత్రివర్యులు సముద్రాల వేణుగోపాల చారి, ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కోమురం కోటేశ్వర్,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెరుగు భోజన్న , మాజీ ఎంపీపీ మల్లేష్ పాల్గొన్నారు.

# ఉస్మాన్ పుర లో సర్వే ఎన్యూ మినేటర్లు..?

**గంభీరావుపేట నవంబర్ 22(ప్రభాత సమాచారం):**
ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా సర్వే ఈ నెల 9 నుంచి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గంభీరావుపేట మండల కేంద్రంలో ఉస్మాన్ పురలో ఇంటింటా సర్వే కి కొంత మంది ఇండ్లకు నిర్వహించి కొంత మంది ఇండ్లకు సర్వే చేయడం మరిచి పోయారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూల్స్ ప్రకారం ప్రతి ఇంటి కి ఇంటింటా సర్వే పోస్టర్లు ఆశ వర్కర్లు అతికించారు కానీ సర్వే చేసే ఎన్యూ మినేటర్లు మాత్రం వీధిలో కొంత మంది ఇండ్లకు సర్వే చేసి కొంత మంది ఇండ్లకు మరచి పోవడంతో ఇదేమి పద్దతి సర్వే చేస్తే సీరియల్ ప్రకారం చేయాలి కానీ ఇష్టం వచ్చి నట్టు ఎలా చేస్తారని ఉస్మాన్ పురలో ఎవరి ఇండ్లనైతే మరిచారో వారి ఇండ్లకు సర్వే చెయ్యాలని కోరారు.

## యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన వ్యక్తికి 10 సంవత్సరాల జైలు శిక్ష

**ఆసిఫాబాద్ నవంబర్ 22 (ప్రభాత సమాచారం)**
యువతిని పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఆమెను అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు ఇరవై అయిదు వేల రూపాయల జరిమానా విధిస్తూ అసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపాల్ అండ్ సెషన్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ తీర్పు ఇచ్చారు. వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం అసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం తేజపూర్ గ్రామానికి చెందిన నగోషే వినేష్ అను వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఒక మహిళను గత 3 సంవత్సరాలుగా ప్రేమిస్తున్నానని చెప్పి, పెళ్లి చేసుకుంటానని చెప్పి, అనేకసార్లు శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఆ అమ్మాయి కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోవాలని నాగోషే వినేష్ ని అడగగా అతను నిరాకరించెను. దానితో సదరు మహిళా వాంకిడి పోలీస్ స్టేషన్లో 2021నవంబర్ 20న ఫిర్యాదు చేయగా అప్పటి ఐవో సుధాకర్ నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో హాజరుపరచగాపి పి జగన్మోహన్రావు సాక్షులను హాజరు పరచగా గౌరవ జడ్జి సాక్షులను విచారించగా నేరం చేసినట్టు రుజువు కావడంతో నిందితుడు నాగోశె వినేష్ కి 10 సంవత్సరాల జైలు శిక్ష మరియు 25000 రూపాయలు జరిమాన విధిస్తూ జిల్లా జడ్జ్ తీర్పు ఇవ్వడం జరిగింది. కేసులో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత అసిఫాబాద్ డిఎస్పి కరుణాకర్ , వాంకిడి సిఐ సత్యనారాయన , ఎస్సై ప్రశాంత్ , కోర్టు అసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ రామ్ సింగ్ మరియు కోర్ట్ సిబ్బంది పూల్ సింగ్ ని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అభినందించారు.

## పాఠశాలకు క్రీడా పరికరాలు అందించిన పూర్వవిద్యార్థులు



**బోథ్ నవంబర్ 22( ప్రభాత సమాచారం )**
మండలంలోని దన్నూరు బి గ్రామ ప్రాథమిక పాఠశాలకు అ పాఠశాల పూర్వ విద్యార్థులు క్రీడా పరికరాలను అందజేసి ఆదర్శంగా నిలిచారు. క్రీడా పరికరాల కొరతను గూర్చి విష్ణు అనే యువకుడు దన్నూర్ బి అభివృద్ధి ఫోరం సోషల్ మీడియా గ్రూప్ లో పోస్ట్ చేశారు. ఇది గమనించిన గ్రామానికి చెందిన ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన చౌకి చంద్రకాంత్ స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.కె హైదర్ అలాగే ప్రైవేటు చిరు ఉద్యోగి రత్నాపురం లింగన్న స్పందించి పాఠశాల పూర్వ విద్యార్థులుగా తమ వంతుగా ఆర్థిక విరాళల రూపంలో 8వేలు అందించారు. దీంతో ఆ విరాళాలతో క్రీడా పరికరాలను కొని స్కూల్ సిబ్బందికి శుక్రవారం డాక్టర్ గంగారం చేతుల మీదుగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజుకు అందించారు. మానవతా దృక్పథంతో యువకులు చేసిన సహాయాన్ని గ్రామస్తులు అభినందనలతో కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్, వ్యాయమా ఉపాధ్యాయురాలు సంగీత, షేక్ అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే దంపతులు





**ములుగు నవంబర్ 22(ప్రభాత సమాచారం)**
మేడారం గ్రామంలో కొలువుదీరిన ఆదివాసుల ఆరాధ్య దేవతలు సమ్మక్క సారలమ్మలను ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క సారక్క గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. వారి వెంట సమ్మక్క సారక్క దేవాలయం ఈఓ కొప్పుల రవి, పూజారి స్వామి తదితరులు ఉన్నారు.

# బెల్లంపల్లిలో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా


### .. ఎంసీపీఐ యు పార్టీ ఆధ్వర్యంలో తాసిల్దార్ కు వినతి పత్రం అందజేత



**.బెల్లంపల్లి,నవంబర్ 22( ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వంలో యదేచ్ఛగా కబ్జా అవుతున్నా సంబంధిత అధికారులు నమ్మకు నేర ఇచ్చినట్లు వ్యవహరించడంతో కబ్జాదారులు తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి కోర్టుల నుండి నోటీసులు అందిస్తున్నప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం మాత్రం కౌంటర్ దాఖలు చేయకపోవడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా ప్రభుత్వ భూములను కాపాడేలా చర్యలు చేపట్టాలని ఎంసిపిఐయూ పార్టీ నాయకులు శుక్రవారం రోజు బెల్లంపల్లి తహసిల్దార్ జోష్నాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కబ్జాదారుల కబంధ హస్తాల నుండి ప్రభుత్వ భూములను కాపాడాలని బెల్లంపల్లి తాసిల్దార్కి ఎంసిపిఐ(యు) పార్టీ జిల్లాకార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని,పాలిటెక్నిక్ కళాశాల ముందు గల దాదాపు 20 లక్షల రూపాయలు విలువ చేసే భూమి,అలాగే 2వ వార్డ్ ఇందిరమ్మ కాలనిలోని అంగన్వాడీ సెంటర్ కు సంబందించిన భూమిని కొంతమంది అధికారులు,ప్రజాప్రతినిధుల అండదండలతో అడ్డు అదుపు లేకుండా కబ్జా చేస్తున్నారని,నకిలీ పేపర్స్ సృష్టించి కోర్టులను సైతం బురిడీ కొట్టిస్తూ స్టే ఆర్డర్స్ తీసుకువస్తున్నారని,అధికారులకు పలుసార్లు విన్నవించిన కేవలం వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప ఫలితం లేకుండా పోతుందని,అధికారులను ప్రశ్నిస్తే అవి కోర్టులో ఉన్నాయని ఏమి చేయలేమని చేతులు దులుపుకుంటున్నారని,ప్రభుత్వ భూమని తెలిసిన ఏమి చేయలేక పోవడమే కాక కబ్జా దారులు అధికారులకు పంపిన కోర్టు ఆడర్స్ కు బదులు వీరు తిరిగి కౌంటర్ దాఖలు చేయకుండా చోద్యం చూస్తూ ఉండటం వల్ల కబ్జాదారులు ఇదే అదునుగా భావించి నిర్మాణాలు చేపడుతున్న అధికారులు అడ్డుకోవడంలో విఫలమయ్యారని,ఇప్పటి వరకు ఎంతమంది ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారని అధికారులకు కంప్లీట్ చేశారో,ఎంతమంది కోర్టు నుండి నోటీసులు చూపెట్టారో,పంపారో,ఎన్ని అక్రమ కట్టడాలు కూల్చివేశారో,కోర్టుల నోటీసులు పంపించిన భూములు ప్రభుత్వ భూముల, ఇతర భూముల ఏమైనా గుర్తించారో,ప్రభుత్వ భూములైతే ఎన్నింటిపై కోర్టులో వీరికి వ్యతిరేకంగా కౌంటర్లు దాఖలు చేశారో,ఎంతమంది పై క్రిమినల్ కేసులు బుక్ చేశారో వీటన్నింటిపై అధికారులు శ్వేత పత్రం విడుదల చేయాలని,ప్రభుత్వ భూములను కాపాడాలని నిజమైన నిరుపేదలకు పంచాలని లేనియెడల ఎం సి పి ఐ యు పార్టీ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రకటించారు .ఈ కార్యక్రమంలో మండల,పట్టణ కార్యదర్శులు ఆరెపల్లి రమేష్,సతీష్ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**కాగజ్ నగర్ నవంబర్ 22, ( ప్రభాత సమాచారం )**
విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలో పెట్రోల్ బంక్ ఏరియాలో గల మహాత్మ జ్యోతిబాపూలే, తెలంగాణ బి. సి. సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి సందర్శించి తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలు, పరిసరాలు, వంట సామాగ్రి, రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యమైన విద్యాబోధన అందించాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను సన్నద్ధం చేయాలని, అదనపు తరగతులు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన తీరుపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించి వంట సామాగ్రి నిల్వలను తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులను వినియోగించాలని, స్నానపు గదులు, మూత్రశాలలు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, చలికాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థుల ఆహారంలో కాలం చెల్లిన సరుకులను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. దహేగాం మండలంలోని చిన్న రాస్పల్లి గ్రామంలో భూమిని కేటాయించి త్వరలో పక్కా భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.సి. సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారి సజీవన్, తహసిల్దార్ కిరణ్ కుమార్, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గర్భస్థ మహిళల మరణాలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**నిర్మల్ నవంబర్ 22 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో గర్భస్థ మహిళల మరణాలను నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు .గర్భస్థ మరణాలపై వైద్య ఆరోగ్యబీశాఖ అధికారులతో శుక్రవారం తన చాంబర్లో సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ మరణాలు జరగకుండా అధికారులు తగిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు.ఇదివరకే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో హైపర్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె గుర్తు చేశారు . జిల్లా ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఏఎన్ఎం ,ఆశ వర్కర్లకు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు గర్భస్థ మరణాల నియంత్రణ కోసం చేపట్టవలసిన చర్యలపై వారానికి కొందరు వైద్యులు , సిబ్బంది చొప్పున విస్తృత శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆమె చెప్పారు . హై రిస్కు గర్భస్థ మహిళలకు ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో హెల్ప్ లైన్ ను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు . ఈ హెల్ప్ లైన్ కేంద్రం లో నలుగురు ఏఎన్ఎం ,సిబ్బందిని నియమించి , హై రిస్కు గర్భిణీ మహిళలకు ఒక్కొక్కరిగా ఫోన్లు చేసి వారి ఆరోగ్య స్థితి వివరాలను తెలుసుకునేటట్లు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు .అదేవిధంగా అవసరమైన వైద్య సేవల వివరాలను మహిళలకు తెలియజేయనునట్లు తెలిపారు .ఇప్పటికే హై రిస్క్ గర్భిణులకు హెల్ప్ లైన్ లో పనిచేసే సిబ్బంది ఎప్పటికప్పుడు సలహాలు సూచనలు ఇస్తూ ఉంటారని అన్నారు. గర్భిణీలలో హృదయ సంబంధ సమస్యలు వచ్చినట్లయితే ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో టుడికో వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ,అవసరమైన వారికి తగిన వైద్యం అందించనున్నట్లు ఆమె తెలిపారు. గర్భం దాల్చిన వెంటనే మహిళలందరూ అవసరమైన మేరకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు . ఈ సమావేశంలో డి ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేందర్ , వైద్యులు సురేష్ ,శ్రీనివాస్ , సౌమ్య ,అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ఆదర్శ రైతుల నియామకం: తుమ్మల



హైదరాబాద్: వ్యవసాయ కమిషన్ సూచనలకు అనుగుణంగా సాగురంగాన్ని బలోపేతం చేసేందుకు ఆదర్శ రైతుల నియామకం చేపడతామని ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ) కమిటీలను సైతం నియమించి, వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి తమ సభ్యులతో కలిసి సచివాలయంలో మంత్రిని కలిశారు. కోదండరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వెయ్యి ఎకరాలకు ఒక ఆదర్శ రైతు నియామకం.. వ్యవసాయానికి ఉపాధిహామీ పథకం అనుసంధానం.. వ్యవసాయ యంత్రాల కొనుగోలుపై జీఎస్టీ తొలగింపు.. విత్తన చట్టంలో మార్పులు.. రైతు ఉత్పత్తి సంఘాల బలోపేతం.. తదితర అంశాలపై విన్నవించారు. ఆదర్శ రైతుల నియామకంపై నివేదిక సమర్పించాలని వ్యవసాయశాఖ అదనపు సంచాలకుడిని మంత్రి ఆదేశించారు. వ్యవసాయాభివృద్ధికి మరిన్ని సూచనలు, సలహాలు ఇవ్వాలని కమిషన్‌ను మంత్రి కోరారు.

## నిర్మల్ పట్టణంలో ముమ్మరంగా కొనసాగుతున్న సర్వే



**నిర్మల్ నవంబర్ 22 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ పట్టణంలో సామాజిక ,ఆర్థిక ,విద్య ,ఉపాధి , రాజకీయ, కుల సర్వే ముమ్మరంగా కొనసాగుతున్నది .ఇచ్చిన గడవు గడుస్తుండడం తో ఎన్యుమరేటర్లు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పనుల స్పీడును పెంచుతూ కుటుంబ వివరాలను నమోదు చేస్తున్నారు .మొత్తం 8 పేజీల్లో 55 కాలమ్లను భర్తీ చేయాల్సి ఉండగా ,ఆయా కుటుంబాల్లో అవసరమైన సమాచారం వెనువెంటనే ఇవ్వకపోతే ఒకటికి మూడు నాలుగు సార్లు తిరగాల్సి వస్తుందని ఎన్యుమరేటర్లు వాపోతున్నారు. కొన్ని చోట్ల కుటుంబ వివరాలు ఇవ్వటానికిససేమిరా అంటూ ఇంటి యజమానులు వాగ్వివాదానికి దిగుతున్నారు .కానైతే అవసరమైన చోట సూపర్వైజర్లు ,సంబంధిత అధికారులు తరచూ పర్యవేక్షణలు జరుపుతున్నారు ..ఎక్కడైనా సమస్యలు వస్తే అక్కడికి వెళ్లి సామరస్యంగా పరిష్కరిస్తున్నారు .వృత్తి ,ఆదాయ ,బ్యాంకు అకౌంట్ ఇవ్వడానికి ఆయా ఇంటి యజమాలు అనేక సంశయాలను వెలిబుచ్చుతున్నారు .కొన్ని చోట్ల వివరాలకుగాను కోడ్ నెంబర్లు ఇవ్వవలసి ఉండడంతో మరింత ఆలస్యమవుతుందని ఎన్యూమరేటర్లు తెలియజేస్తున్నారు. కాగా నిర్మల్ పట్టణంలోని 29వ వార్డులో ఇదివరకే 192 ఇండ్లు సర్వే చేసినట్లు ఎన్యుమరేటర్ పద్మ ,సూపర్వైజర్ మొయినుద్దీన్లు తెలిపారు . మిగతా సర్వేను రెండు మూడు రోజుల్లో పూర్తిచేస్తామని వారు తెలిపారు

## గ్రంథాలయంలో సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తేవాలి

### పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





**నిర్మల్ నవంబర్ 22(ప్రభాత సమాచారం)**
జిల్లా గ్రంథాలయంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తేవాలని ,వాటి పరిష్కారానికి అన్ని విధాల చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు .పోటీ పరీక్షల కోసం సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు అవసరమయ్యే పుస్తకాలు అన్నింటిని గ్రంథాలయంలో అందుబాటులో ఉంచాలని ఆమె అధికారులకు ఆదేశించారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు .ఈ సందర్భంగా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్న ద్ధమయ్యే అభ్యర్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. గ్రంథాలయంలో పాఠకులు కూర్చోవడానికి సరిపడినన్ని కుర్చీలను సమకూర్చుకోవాలని గ్రంథాలయ అధికారులను సూచించారు .పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సమయపాలన పాటిస్తూ శ్రద్ధగా చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆమె కోరారు . ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ తదితరులు పాల్గొన్నారు

## కుమ్రం భీమ్ అసిఫాబాద్ జిల్లాలో అరుదైన ఇండియన్ వెల్డ్ డాగ్స్



**అసిఫాబాద్ నవంబర్ 22(ప్రభాత సమాచారం)**
అంతరించిపోతున్న వన్యప్రాణుల జాబితాలో ఉన్న అరుదైన ఇండియన్ వైల్డ్ డాగ్స్(అడవి కుక్కలు) తెలంగాణలో కనిపించాయి. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ అడవుల్లో అరుదైన ఇండియన్(ఏసియన్) వైల్డ్ డాగ్స్ సంచారం కెమెరాలకు చిక్కాయి. ఓ నీటి కుంట వద్ద నీళ్ల కోసం వచ్చిన ఇండియ్ వైల్డ్ డాగ్స్ దృశ్యాల వీడియో వైరల్ గా మారింది. కమ్మర్గాం- మురళిగూడ మధ్య అటవీ ప్రాంతాంలోని చెరువ వద్ద మూడు ఇండియన్ వైల్డ్ డాగ్స్ స్థానిక యువకుల కెమెరాకు చిక్కాయి. పెంచికల్ పేట రేంజ్ పరిధిలో సుమారుగా ఐదు నుంచి పది ఏసియన్ వైల్డ్ డాగ్స్ ఉన్నాయని అటవీశాఖ అధికారులు చెప్పారు. అంతరించిపోతున్న జాతుల్లో ఒకటైనా వైల్డ్ డాగ్స్ కి ఎవరైనా హాని తలపెడితే కఠిన చర్యలు ఉంటాయంటూ అటవిశాఖ హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణలో కృష్ణా తీరం నల్లమల, గోదావరి తీరం ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల ఆడవులు పెద్దపులులతో పాటు అరుదైన వన్య ప్రాణుల ఆవాసంగా మారి జీవ వైవిధ్యానికి వేదికవ్వడం విశేషమంటున్నారు పర్యావరణ నిపుణులు. ఈ అరుదైన ఇండియన్ వైల్డ్ డాగ్స్ దేశంలోని పెంచ్ నేషనల్ పార్క్ , సత్పురా నేషనల్ పార్క్ మరియు సెంట్రల్ ఇండియాలోని తడోబా నేషనల్ పార్క్ , దక్షిణ కర్ణాటక రాష్ట్రంలోని బందీపూర్ , నాగర్‌హొల్ నేషనల్ పార్క్ లలో కనిపిస్తాయి. మధ్య భారతదేశం, పశ్చిమ, తూర్పు హిమాలయాలలో, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్‌లలో కూడా వీటిని చూడవచ్చని తెలిపారు

# భారతీయ సంస్కృతిని పటిష్ఠం చేయాలి: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



హైదరాబాద్: భారతీయ సంస్కృతి, ఆచారాలను నిరంతరం పటిష్ఠం చేయాల్సి ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో లోక్‌మంథన్ ప్రధాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. దేశ ప్రజల్లో సాంస్కృతిక, స్వాభిమాన్ భావన నెలకొల్పాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రాలను బలోపేతం చేసే దిశగా లోక్ మంథన్ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. "2018లో రాంచీలో లోక్‌మంథన్ కార్యక్రమంలో పాల్గొన్నా. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పటిష్ఠానికి ఈ ప్రయత్నం గొప్పది. ఇందులో పాల్గొంటున్న ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నా. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంస్కృతిలో భాగం. ఇది ఇంద్రధనస్సులోని సౌందర్యాన్ని సూచిస్తుంది" అని ద్రౌపదీ ముర్ము అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మద్దతు ధర లేదు.. బోనస్ బోగస్ అయింది: హరీశ్‌రావు



ఖమ్మం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. బోనస్ మాట బోగస్ అయిందని.. మద్దతు ధర కూడా రావట్లేదన్నారు. ఖమ్మంలో మీడియాతో ఆయన మాట్లాడారు. "పత్తిలో ప్రతి క్వింటాకు రైతుకు రూ.1500 నష్టం వాటిల్లుతోంది. ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడం, కుట్రలు చేయడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది జీరో. వరి, పత్తి పంట దళారుల పాలవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోంది? రైతుబంధు, మద్దతు ధర లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పత్తికి గరిష్ఠంగా రూ.11 వేలు, కనిష్ఠంగా రూ.9 వేల ధర పలికింది. ఇప్పుడు ఎందుకు ధర తగ్గింది? పత్తి రైతులకు మద్దతు ధర రావాలి.. రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఆంధ్రా దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ మాటలకు తేడా ఉంటోంది. ఖమ్మం జిల్లా మంత్రులు ఆధిపత్యం కోసం బాగా బిజీ అయ్యారు. ప్రజాసమస్యలను గాలికొదిలి గొప్పలకు పోతున్నారు" అని హరీశ్‌రావు విమర్శించారు.

# దాచేస్తే దాగని సత్యం.. చెరిపేస్తే చరగని చరిత్ర..

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతి రోజూ సోషల్ మీడియా వేదికగా ఎక్స్‌లో పోస్టులు చేస్తున్నారు. శుక్రవారం బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆయన ట్వీట్ చేశారు. 'దాచేస్తే దాగని సత్యం.. చెరిపేస్తే చరగని చరిత్ర.. కేసీఆర్ తెలంగాణ లో సాధించిన నీలి విప్లవం' అంటూ ఆయన పేర్కొన్నారు. 2016-17లో 1.93 లక్షల టన్నుల చేపల పెంపకం నుండి 2023-24కు 4.39 లక్షల టన్నులు ఎగబాకిన వైనమని అన్నారు. తెలంగాణ చేపల పెంపకంలో ఉత్తమ 'ఇన్ ల్యాండ్ స్టేట్'గా అవార్డు కైవసం చేసుకోవడం కేసీఆర్ విజయమని వ్యాఖ్యానించారు. 'అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు.. భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడు.. అదానీలాంటి దగాకోరుకు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతులు ఇచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎంత ఇవ్వజూపిండో, మూసీలో అదానీ వాటా ఎంతో చెప్పాలని 'ఎక్స్'లో డిమాండ్ చేశారు. 'తెలంగాణ ఆస్తులను కొల్లగొట్టే కుయుక్తుల్లో మీ బడే భాయ్ వాటా.. మీ అదానీ భాయ్ వాటా.. మీ హైకమాండ్ వాటా ఎంత?' అని పరోక్షంగా సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. అదానీతో బీజేపీ, కాంగ్రెస్ అనుబంధం దేశానికే అవమానం, అరిష్టమని, అవి అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలను




బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

**అదానీకో న్యాయం ఆడబిడ్డకో న్యాయమా..: కవిత...** ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలు నుంచి విడుదలైనప్పటి నుంచి వార్తలకు దూరంగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎట్టకేలకు గురువారం అదానీ అంశంపై స్పందించారు. అఖండ భారతంలో అదానీకో న్యాయం, ఆడబిడ్డకో న్యాయమా.. అంటూ ప్రశ్నించారు. ఆధారాలు లేకున్నా ఆడబిడ్డను కాబట్టి అరెస్ట్ చేయడం ఈజీ, ఆధారాలున్నా అదానీని అరెస్ట్ చేయడం మాత్రం కష్టమా.. అని కవిత అడిగారు.

# ములుగు జిల్లాలో మావోయిస్టుల దుశ్చర్య.. పంచాయతీ కార్యదర్శి సహా మరొకరి హత్య

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరిని గొడ్డలితో నరికి చంపారు. వాజేడులో పెనుగోలు కాలనీలో పేరూరు పంచాయతీ కార్యదర్శి ఉయికా రమేశ్, స్థానికుడు ఉయికా అర్జున్‌ను గురువారం అర్ధరాత్రి హతమార్చారు. వెంకటాపురం-వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరిట మావోయిస్టులు రెండు లేఖలను మృతదేహాల వద్ద వదిలి వెళ్లారు. రమేశ్‌ను గొడ్డలితో నరికిన సమయంలో ఆయన భార్య గట్టిగా కేకలు వేయడంతో మావోయిస్టులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన రమేశ్‌ను ఏటూరు నాగారం ఆస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు.




ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక


విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194


# చెరువుల రక్షణ కోసం హైడ్రా కీలక నిర్ణయం



హైదరాబాద్: హైడ్రా ఈ ఏడాది జూలైలో ఏర్పడిందని.. అర్బన్ డిజాస్టర్స్, ఎంక్రోచ్‌ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఇవాళ(శుక్రవారం) బుద్ధ భవన్ హైడ్రా కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు కమిషనర్ రంగనాథ్ కీలక సమావేశం నిర్వహించారు. రిటైర్డ్ ఈఎన్సీలు, ఇరిగేషన్ సీఈలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కనుమరుగైన చెరువులపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను అధికారులు నిర్ణయించారు. ఇకపై చెరువులు అన్యాక్రాంతం కాకుండా హైడ్రా చీఫ్ రంగనాథ్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. "ఐఎండీ 1875లో ఏర్పడింది. హైడ్రా జీహెచ్ఎంసీలో భాగం కాదు. ఇది వరకు ఈవీడీఎం పేరుతో జీహెచ్ఎంసీలో భాగంగా ఉండేది.. అప్పుడు ఐఏఎస్‌లు, కమిషనర్లు ఉండేవారు. ఇప్పుడు సెపరేట్ వింగ్‌గా ఏర్పడింది. హైడ్రాకు మొదటి కమిషనర్‌గా ఉండటం సంతోషంగా ఉంది.దేశంలోనే మొదటి సారి హైడ్రా తీసుకొచ్చారు. కేవలం జీహెచ్ఎంసీలో మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఉన్న మరో 27 మునిసిపాలిటీల పరిధిలో హైడ్రా పనిచేస్తుంది.. వాటర్ బాడీస్, గవర్నమెంట్ ల్యాండ్స్, పబ్లిక్ అసెట్స్, లేక్స్ ఆక్రమణలకు గురవుతున్నాయి.. వాటికోసం హైడ్రా పనిచేస్తుంది. హైదరాబాద్ అంటేనే గొలుసు కట్టు చెరువులు.. ఒక చెరువుకు మరో చెరువుకు కనెక్టివిటీ ఉండేది..ఇప్పుడు కనెక్టివిటీ లేదు. నాలాలు కూడా సరిగా లేవు. గట్టి వర్షం పడితే ముంపుకు గురవుతాయి..దివి సీమ ఉప్పెన వచ్చినప్పుడు 10వేల మంది చనిపోయారు. పేదరికం వల్ల చాలామంది ముందస్తు సమాచారం లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయారు. "ఐఎండీ వల్ల ముందే ఊహించగలుగుతున్నారు.. డిజాస్టర్స్‌లో కూడా మార్పులు వస్తున్నాయి..దేశంలో అర్బనైజేషన్ పెరుగుతుంది.తెలంగాణలో అర్బనైజేషన్ పెరుగుతుంది. వెహికిల్ పాపులేషన్ 80 లక్షలుగా ఉంది. సిటీ ట్రాఫిక్ అడిషనల్ సీపీగా కూడా ఉన్నాను. 2, 3 సెంటిమీటర్ల వర్షం పడితే మూడు, నాలుగు గంటలు ట్రాఫిక్ జామ్ అవుతుంది. మెట్రో సిటీలలో వాతావరణ మార్పులు ఎక్కువగా ఉన్నాయి. క్లౌడ్ బరస్ట్స్ కూడా పెరుగుతున్నాయి. నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి.. వర్షం పడినప్పుడు వరద నీరు ఇంకడానికి చాలా సమయం పడుతుంది. సాయంత్రం 4, 5 గంటలకు వర్షం పడితే భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.. ఆ నీరు ఇంకడానికి మార్గాలు లేవు.. సిటీలో 150 వాటర్ లాగింగ్స్ ఉన్నాయి. అర్బన్ డిజాస్టర్‌ల మీద ఫోకస్ పెట్టాలి.157 ఏడబ్ల్యూఎస్ స్టేషన్స్ ఉన్నాయి.. ఇంకా కావాలి. ప్రతి 15నిమిషాలకు బెంగుళూరులో ఏడబ్ల్యూఎస్ స్టేషన్‌ల నుంచి డేటా కలెక్ట్ చేస్తారు.. మనం కూడా దీనికి మారాలి. సిటీలో వెదర్ రెడర్స్ కావాలి..జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి హిల్ ఏరియాల్లో పెట్టాల్సిన అవసరం ఉంది. వెదర్ అలర్ట్స్ స్పెసిఫిక్‌గా ఉండాలి.

ఇక్కడ వర్షం పడుతుందని కాకుండా ఇక్కడ పడదని చెప్పేలా వెదర్ అలర్ట్స్ ఉండాలి. వర్షాలు పడుతున్నపుడు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం వల్ల ఎకనామికల్ లాస్ కూడా ఏర్పడుతుంది..హైడ్రా, ఐఎండీతో కలిసి పనిచేస్తుంది. అర్బన్ డిజాస్టర్స్‌కో సంబంధించి ఐఎండీతో కలిసి పనిచేస్తుంది. నేను మెకానికల్ ఇంజనీర్‌ని, అయినా వీటి గురించి తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను. ప్రజలు వెదర్ అలర్ట్స్‌ని సీరియస్‌గా తీసుకునేలా హైడ్రా పని చేస్తుంది" అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.




భారత నౌకాదళానికి చెందిన స్కార్పియన్ శ్రేణి జలాంతర్గామి భారీ ప్రమాదానికి గురైంది. గోవా తీరానికి 70 నాటికల్ మైళ్ల దూరంలో నౌకాదళ సబ్‌మెరైన్‌ను చేపల వేట పడవ మారథోమా ఢీకొంది. ఈ విషయాన్ని శుక్రవారం రక్షణశాఖ అధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో పడవలో 13 మంది ఉన్నారు. వీరిలో 11 మందిని రక్షించినట్లు భారత నౌకాదళం పేర్కొంది. మరో ఇద్దరు ఆచూకీ గల్లంతైంది. నౌకాదళ ప్రతినిధి ఈ విషయాన్ని వెల్లడించారు. వీరి కోసం కూడా గాలింపు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన అదనపు సామగ్రిని రప్పించారు. ఈ ప్రాంతం మొత్తాన్ని కోస్ట్‌గార్డ్ ఆధీనంలోకి తీసుకొని.. నౌకల మార్గాలను మళ్లించింది.

జలాంతర్గామికి ఏమేరకు నష్టం జరిగిందనే విషయం వెల్లడి కాలేదు. గోవా వద్ద ప్రమాదానికి గురైంది స్కార్పియన్ శ్రేణికి చెందిన అత్యాధునిక జలాంతర్గామిగా భావిస్తున్నారు. నౌకాదళంలో వివిధ రకాల మిషన్లను చేపట్టే సామర్థ్యం దీని సొంతం. యాంటీ సర్ఫేస్ వార్ఫేర్, యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ కోసం దీనిని తయారు చేశారు. అత్యాధునిక శబ్ద నియంత్రణ టెక్నాలజీతో దీనిని తయారు చేశారు.

# ప్రజాభీష్టం లేకుండా భూములు తీసుకోవద్దు

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

హైదరాబాద్: 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల ఇష్టం లేకుండా భూములను ప్రభుత్వం తీసుకునేందుకు వీలులేదని, రైతుల తరపున పోరాడుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటన నేపథ్యంలో తమ్మినేని వీరభద్రం, పశ్య పద్మ ఆధ్వర్యంలో 11 పార్టీల నాయకులు దుద్యాల మండలం రోటిబండ తండా, లగచర్ల, పులిచర్లకుంట తండాల్లో పర్యటించి పలువురు రైతులతో మాట్లాడారు. అనంతరం తమ్మినేని మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ తరహాలో సీఎం రేవంత్‌రెడ్డినిరంకుశ పోకడలతో ప్రజాభీష్టం లేకుండా భూములు సేకరించడం సరైనది కాదని సూచించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలతోపాటు ఏడో గ్యారంటీగా రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, స్వేచ్ఛను పునరుద్ధరించడమే అని చెప్పిన రేవంత్‌రెడ్డి.. గెలిచాక ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చాక ప్రగతిభవన్ గేట్లను తొలగించడం తప్ప ప్రస్తుతం జరుగుతున్న పనులన్నీ అప్రజాస్వామికమని ఎద్దేవా చేశారు. లగచర్ల ఘటనలో అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలని సీపీఐ నాయకురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు.




వాషింగ్టన్: ప్రముఖ పారిశ్రామికవేత్త, బిలియనీర్ గౌతమ్ అదానీపై అమెరికాలో కేసు నమోదవడం సంచలనంగా మారింది. సౌర విద్యుదుత్పత్తి సరఫరా ఒప్పందాలు చేసుకునేందుకు భారత్‌లో రూ.2,029 కోట్ల లంచాలు ఇచ్చారని, ఆ సొమ్ము కోసం తప్పుడు సమాచారం ఇచ్చి అమెరికాలో నిధులు సేకరించారని అదానీ సహా 8 మందిపై కేసు నమోదైంది. దీనిపై తాజాగా అమెరికా అధ్యక్ష భవనం స్పందించింది. ఈ సంక్షోభాన్ని ఇరు దేశాలు అధిగమించగలవని విశ్వాసం వ్యక్తం చేసింది. శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరీన్ జీన్ పియర్ తన రోజువారీ మీడియా సమావేశంలో అదానీ గ్రూప్ వ్యవహారం గురించి స్పందించారు. "అదానీపై కేసు నమోదైన విషయం మా దృష్టికి వచ్చింది. ఈ ఆరోపణలపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్, న్యాయశాఖనే సరైన సమాచారం ఇవ్వగలదు. భారత్-అమెరికా మధ్య సంబంధాలు ఎప్పటిలాగే బలంగా ఉన్నాయి. అనేక అంశాలపై పరస్పర సహకారం అందించుకుంటున్నాం. మిగతా సమస్యల మాదిరిగానే ప్రస్తుత సంక్షోభాన్ని కూడా ఇరుదేశాలు అధిగమించగలవు. ఇరు దేశాల మధ్య బంధం బలమైన పునాదిపై నిలబడింది" అని కరీన్ విశ్వాసం వ్యక్తం చేశారు. లంచాల సొమ్ము కోసం తప్పుడు సమాచారమిచ్చి అమెరికాలో నిధులు సేకరించారని.. అదానీ గ్రూప్ ఛైర్మన్ అదానీతోపాటు సాగర్ అదానీ, వినీత్ ఎస్.జైన్, అజూర్ పవర్ సీఈఓ రంజిత్ గుప్తా ఈ లంచాల పథకానికి సూత్రధారులని పేర్కొంది. ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ చట్టం (ఎఫ్‌సీపీఏ) కింద వీరికి సహకరించిన మరో ఐదుగురిపైనా కేసులు నమోదు చేసింది. ఈ కేసులో గౌతమ్ అదానీతోపాటు సాగర్ అదానీపైనా బుధవారం అమెరికాలో అరెస్ట్ వారంట్లు జారీ అయినట్లు కొన్ని వార్తా సంస్థలు వెల్లడించాయి. 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభాన్ని పొందేలా అధిక ధరకు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేలా వీరంతా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 'ఉన్నతస్థాయి' వర్గాలకు లంచాలు ఇచ్చినట్లు నివేదికలో ఆరోపణలున్నాయి.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660